క్లుప్తంగా

ఈకేవైసీ తప్పనిసరి



వన్నలిలో ఈకేవైసీ చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని ప్రతీ రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వన్నలి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈకేవైసీని ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను రైతు సేవా కేంద్రాల వద్ద విక్రయించాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. రైతులంతా ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంతర్‌జిల్లా పోటీలకు నెమలాం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

తెర్లాం: మండలంలోని నెమలాం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు అంతర్‌జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పాఠశాలలో గురువారం అభినందన సభ ఏర్పాటు చేసి, ఎంపికైన విద్యార్థులకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అన్నవరంలో జరిగే అంతర్‌జిల్లా పోటీల్లో కూడా సత్తాచాటి జిల్లాకు, మన పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు, పీడీ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కోడూరుమాత యాత్ర రేపు

బాడంగి: మండలంలోని కోడూరు పుణ్యక్షేత్రంలో పరిశుద్ధ మరియ, కోడూరుమాత యాత్ర శనివారం జరగనుంది. ఈ మేరకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. 40 వేల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పూజలో వారు కూర్చొనేందుకు వీలుగా టెంట్లు, తివాచీలు, కుర్చీలు వంటివి సమకూర్చి, ప్రార్థనా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల దర్శనానికి ప్రార్థనా మందిరం నుంచి గుమ్మటం(మరియమాత కొలువైన స్థలం) వరకు బారికేడ్లు నిర్మించారు. యాత్ర ప్రదేశానికి అరకిలోమీటరు దూరంలోనే వాహనాల పార్కింగ్‌కు సైతం చర్యలు తీసుకుంటున్నారు.

ముగిసిన క్రీడాపోటీలు



నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

సంతకవిటి: మండలంలోని సిరిపురం పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాపోటీలు గురువారంతో ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చదరంగం, బ్యాడ్మింటన్, పరుగుపందెం తదితర క్రీడాంశాల్లో పోటీలు జరగ్గా, ఆయా పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ సన్నిబాబు తెలిపారు.

హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యునో వైరస్) నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య సిబ్బంది.. హెచ్‌ఐవీ ఏ విధంగా సోకుతుంది, ఆ వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆదయ్య, టీబీ సూపర్‌వైజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

న్యాయపోరాటానికి సిద్ధం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి: సీబీఎం స్కూల్ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై న్యాయపోరాటానికి సిద్ధమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు, పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. ఇదే విషయమై వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ క్రిస్టియన్ సంస్థకు చెందిన స్కూల్‌ను ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. రెవెన్యూ, విద్యాశాఖ అధికారుల అండదండలతో సబ్‌రిజిస్ట్రార్ లంచం తీసుకుని మరీ రిజిస్ట్రేషన్ చేసి ఉంటారని ఆరోపించారు. అదే పాఠశాల రిజిస్ట్రేషన్ కోసం సంతకాలు ఎలా చేశారని నిలదీశారు. స్కూల్‌ను యథావిధిగా కొనసాగించాలని, స్కూల్‌ను స్వాధీనం చేసుకోవాలని చూస్తే ఊరుకోమన్నారు.

మొక్కవోని సంకల్పం



మొక్కలు నాటుతున్న రాజాం గ్రీన్‌బెల్ట్ సభ్యులు(ఫైల్)



రక్షణగా మొక్కల చుట్టూ కంచె ఏర్పాటు చేసిన దృశ్యం

- పర్యావరణ పరిరక్షణకు 'రాజాం గ్రీన్ బెల్ట్' కృషి
- పట్టణ, పట్టణ పరిసరాల పచ్చదనమే లక్ష్యంగా చర్యలు
- రెండు నెలల్లో 1100 మొక్కలు నాటిన సభ్యులు
- దత్తత తీసుకుని మరీ మొక్కల పెంపకం

రాజాం: పర్యావరణ పరిరక్షణకు రాజాం గ్రీన్‌బెల్ట్(పర్యావరణ పరిరక్షణ సమితి) విశేషంగా కృషి చేస్తోంది. నిత్యం ప్రజలను చైతన్యం చేస్తూ పట్టణ, పట్టణ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. 60 మంది సభ్యులతో మొదలైన రాజాం గ్రీన్‌బెల్ట్.. ఇప్పుడు 800 మంది సభ్యులను దాటింది. వీరంతా మొక్కవోని దీక్ష, సంకల్పంతో పర్యావరణ పరిరక్షణకు శ్రమిస్తున్నారు. ఇటీవల మొక్కలు నాటడంలో ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. కేవలం రెండు నెలల వ్యవధిలో రాజాం, రాజాం పరిసర ప్రాంతాల్లో 1100 మొక్కలు నాటి, ఆదర్శంగా నిలిచారు.

ఉపాధ్యాయుడి స్ఫూర్తి.. కదిలించింది..

రాజాం మండలంలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఆర్‌వీజే నాయుడు స్ఫూర్తి.. పర్యావరణ ప్రేమికులను కదిలించింది. పర్యావరణ పరిరక్షణకు ఆయన పడుతున్న తపన.. మరికొంతమందిని ఆ దిశగా నడిచేలా చేసింది. ఇలా రాజాం గ్రీన్ బెల్ట్ ఏర్పడింది. తొలిసారి ఆయన తన స్నేహితులతో కలిసి రాజాం మండల కేంద్రంలో మే 17వ తేదీన 60 మంది సభ్యులతో సమావేశమై, గ్రీన్‌బెల్ట్ లక్ష్యాలు వివరించి, పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు సేకరించారు. ఆ తర్వాత వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో గ్రూపులు ఏర్పాటు చేసి, గ్రీన్‌బెల్ట్ లక్ష్యాలు అందరికీ తెలిసేలా చేశారు. ఫలితంగా నెల రోజుల వ్యవధిలో 800 మంది గ్రీన్‌బెల్ట్‌లో కొత్తగా చేరారు. దీంతో సభ్యుల సంఖ్య 850కి చేరింది. వీరిలో కొంతమంది మొక్కలు కొనుగోలు చేసి, ఇచ్చేందుకు ముందుకురాగా, మరికొంతమంది మొక్కల పెంపకం, సంరక్షణ బాధ్యతలు తీసుకునేందుకు ముందుకువచ్చారు. మొత్తం రూ.2.50 లక్షల విరాళం సొమ్ముతో 1100 మొక్కలు కొనుగోలు చేశారు. వీటిలో వేప, కదంబం, బాదం, నేరేడు, రావి, రోజా, పనస, వాటర్‌యాపిల్ తదితర జాతులకు చెందిన మొక్కలను కడియం నర్సరీ నుంచి తీసుకువచ్చి, రాజాం పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, ప్రధాన రోడ్లు, ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద మొక్కలు నాటేలా చర్యలు ప్రారంభించారు. గత రెండు నెలల కాలంలో ఇలా మొత్తం 1100 మొక్కలు నాటారు. అనంతరం వాటి సంరక్షణ బాధ్యతలను ఆయా ప్రాంతాల్లోని గ్రీన్‌బెల్ట్ సభ్యులకు అప్పగించారు.

భావితరాలు బాగుండాలనే..



పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలనే ఆలోచన చాలా మంచిది. మొక్కలు నాటడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం, కాలుష్య రహిత పర్యావరణం సాధ్యమవుతుంది. భావితరాలు బాగుండాలనే సదుద్దేశ్యంతోనే మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అందరి సహకారంతో కార్యక్రమం విజయవంతమైంది. భవిష్యత్‌లో కూడా మరిన్ని కార్యక్రమాలకు సన్నాహాలు చేస్తున్నాం.

– ఆర్‌వీజే నాయుడు, గ్రీన్‌బెల్ట్ కన్వీనర్, రాజాం

ఆన్‌లైన్ విధానంలో ఇసుక అమ్మకాలు



ఇసుక నిల్వల కొలత తీస్తున్న గనుల శాఖ డీడీ సూర్యచంద్రరావు

బొబ్బిలి: ఆన్‌లైన్ విధానం ద్వారా శుక్రవారం నుంచి ఇసుక అమ్మకాలు చేపడుతున్నట్లు గనుల శాఖ డీడీ సూర్యచంద్రరావు తెలిపారు. స్థానిక పట్టణ పరిధిలోని గ్రోత్ సెంటర్ వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆయన గురువారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడి ఇసుక అయిపోతున్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వంగర, కుసుమూరు రీచ్‌లతో పాటు సువర్ణముఖి నదిలోని రీచ్ నుంచి ఇసుకను ఇక్కడకు తరలించి, డంప్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇసుక అయిపోతోందని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ప్రస్తుతం ఇసుక నిల్వల కొలతలు వేస్తున్నామని, మరో రెండు రోజుల్లో ఇసుకను తెప్పిస్తున్నామన్నారు.

అల్లాడ కృష్ణ సేవలు చిరస్మరణీయం



అల్లాడ కృష్ణ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: ఏఎంసీ చైర్మన్‌గా అల్లాడ కృష్ణ రైతులకు ఎంతో మేలు చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కొనియాడారు. మండలంలోని పారాది గ్రామంలో అల్లాడ కృష్ణ బుధవారం రాత్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆ గ్రామానికి గురువారం ఉదయం చేరుకుని, కృష్ణ పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు యు.అప్పలనాయుడు, సర్పంచ్ ధనంజయనాయుడు, ఎంపీటీసీ ఎ.ఉమా, మాజీ ఎంపీటీసీ కె.సత్యం తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



పుట్టిన బిడ్డను చూపిస్తున్న ఈఎంటీ ఈశ్వరరావు

రాజాం: సంతకవిటి మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన పున్నాన కుమారి అనే గర్భిణి 108 అంబులెన్స్‌లో ప్రసవించి, పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. బుధవారం అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో 108 వాహనానికి కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న వాహనంలో గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి, సాధారణ ప్రసవానికి అవసరమైన మందులు అందజేశారు. దీంతో ఆ గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం చికిత్స నిమిత్తం తల్లీబిడ్డలను రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంబులెన్స్ సిబ్బంది సేవలను అందరూ అభినందించారు.

గుర్తింపుకార్డుల పంపిణీ



గుర్తింపుకార్డులతో విద్యార్థులు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ గుర్తింపుకార్డులు గురువారం పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 60 మందికి ఐడీకార్డులు అందించామని ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ప్రత్యేక గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొత్తా సౌందర్య, పెంకి చైతన్యకుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, హెచ్‌ఎం హైమావతి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు

బొబ్బిలి: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు అన్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం సీతారాం మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని విలేకరులతో మాట్లాడారు. నిరుపేదలు, కార్మికులు, రైతుల పక్షాన నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి సీతారాం ఏచూరి అని, ఆయన లేరన్న వార్త జీర్ణించుకోలేదన్నారు. ఆయన ఆశయ సాధనకు తామంతా కృషి చేస్తామన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

వంగర: మండల కేంద్రంలోని పలు వీధుల్లోని కాలువలు, మురుగు ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ గురువారం చేపట్టారు. సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో దోమలు పెరగకుండా ఇలమందు స్ప్రే చేయించారు.

రోడ్లు వేయండి



ఐదో వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని ఐదో వార్డులో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు, కౌన్సిలర్ కలిసి కొత్త రోడ్లు నిర్మించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ చిన్నబజారు రోడ్డుతో పాటు పలు వీధుల్లో రోడ్లు వేయాలని అక్కడి ప్రజలు కోరారన్నారు. బలిజిపేట రోడ్డులో డమ్మీ కుళాయిలు ఉన్నచోట కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జయప్రకాష్ పాఠశాల రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి టెండర్లకు పిలిచామన్నారు.

సమస్యల పరిష్కారానికి 'గ్రామ సందర్శన' దోహదం



వంగర: బాగెంపేటలో వినతులు స్వీకరిస్తున్న మండల ప్రత్యేకాధికారి సందీప్



బాడంగి: భీమవరం గ్రామ సందర్శనలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు



సంతకవిటి: కాకరాపల్లిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న తహసీల్దారు కల్యాణచక్రవర్తి



తెర్లాం: వెలగవలస అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న మండల ప్రత్యేకాధికారి రామారావు

రాజాం/వంగర/రేగిడి/సంతకవిటి/బొబ్బిలి రూరల్/బాడంగి/తెర్లాం/: మండలాల్లోని పలు గ్రామాల్లో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, ఐసీడీఎస్ పీవోలంతా కలిసి గ్రామాల్లో పర్యటించి, అక్కడి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పశువైద్యశాలలు, సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లను సందర్శించి, అక్కడి సిబ్బంది పనితీరు, వసతులను పరిశీలించారు.

అనంతరం నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తుల నుంచి పలు సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి ఈ గ్రామ సందర్శన కార్యక్రమం దోహదం చేస్తుందని, ప్రతిఒక్కరూ తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవాలని తెలిపారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలు పూర్తి చేయాలి



ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తున్న హౌసింగ్ డీఈ అప్పయ్య

రామభద్రపురం: గృహ నిర్మాణాల లక్ష్యాలు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ అప్పయ్య సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో గురువారం సమావేశమైన ఆయన.. ఇళ్ల నిర్మాణాల పూర్తికి వంద రోజుల ప్రణాళిక వేసుకోవాలని తెలిపారు. మండలంలో పునాది దశలో 250, రూఫ్ దశలో 84, శ్లాబ్ దశలో 54, లింటెల్ దశలో 44 ఇళ్లు ఉన్నాయని, వాటిల్లో పురోగతి తేవాలన్నారు. మార్చి 31వ తేదీలోపు పూర్తయిన నిర్మాణాలకే బిల్లులు అవుతాయని, ఆ తర్వాత నిర్మించినా బిల్లులు అవ్వవన్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు అవగాహన కల్పించి, నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు.

బొబ్బిలి రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో పి.రవికుమార్ గురువారం సమావేశమై, గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించడం లేదని, లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. సమావేశంలో ఏఈ ఎ.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



విద్యార్థుల ఆరోగ్యం తనిఖీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు

రేగిడి: మండల కేంద్రంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు గురువారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు ప్రతీ విద్యార్థి ఆరోగ్యం పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఉదయం, సాయంత్రం రెండుపూటలా తప్పనిసరిగా స్నానం చేయాలని, ఉతికి, ఆరబెట్టిన దుస్తులను మాత్రమే ధరించాలని తెలిపారు. ఆరుబయట తినుబండారాలు తినవద్దని, భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఆహార పదార్థాలు వేడివేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలని, కాచిచల్లార్చిన నీటినే తాగాలని తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రమణ, గురుకుల పాఠశాల హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలి



సోపేరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: అన్నిరకాల మందులను విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో అందుబాటులో ఉంచాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని సోపేరు గ్రామ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన గురువారం సందర్శించారు. ప్రజలకు అక్కడి సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అలాగే అక్కడి ఓపీ, నిల్వ ఉంచిన మందుల వివరాలను అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, క్లినిక్‌కు వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. సిబ్బంది కూడా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



రేగిడి: ఉనుకూరులో పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీడీవో శ్యామలాకుమారి



రాజాం: కొఠారిపురంలో సీమంతం చేస్తున్న దృశ్యం

రేగిడి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉనుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన గురువారం చేపట్టారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమ్మన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని కొఠారిపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో కనకదుర్గ మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం బాగుంటుందని, ప్రతిరోజూ మనం తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నిర్మలకుమారి, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఎంఈవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తే కఠిన చర్యలు



రేగిడి: బూరాడ జంక్షన్‌లో వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

రేగిడి:

గంజాయి తరలించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పి.నీలావతి హెచ్చరించారు. మండలంలోని బూరాడ జంక్షన్ వద్ద సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు గురువారం నిర్వహించిన ఆమె.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పసరిగా పాటించాలని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని తెలిపారు. మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. గంజాయి రవాణాపై సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలన్నారు.

గణేశునికి ప్రత్యేక పూజలు

రాజాం సిటీ: పట్టణంలోని వినాయక మండపాల్లో కొలువైన గణేశునికి భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మారుతీనగర్‌తో పాటు వాసవీ థియేటర్, శ్రీకాకుళం రోడ్డులలో ఉదయం, సాయంత్రం పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు.